క్లుప్తంగా

వల్లూరులో వైద్య సేవలు



వల్లూరులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గణపవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి అన్నారు. మంగళవారం గణపవరం మండలం వల్లూరులో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. జనరల్ మెడిసిన్ కె.సుధాకర్, ఆర్థోపెడిక్ సర్జన్ రాఘవేంద్ర, కంటి వైద్య నిపుణులు శ్రీనివాస్, సీహెచ్‌ఓ జాలాది విల్సన్ తదితరులు వైద్య సేవలు అందించారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



బొమ్మిడిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఉంగుటూరు: సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. భద్రతా దళాలతో సమస్యాత్మకంగా గుర్తించిన బొమ్మిడి, కాకర్లమూడి, ఉప్పాకపాడు, నీలాద్రిపురం గ్రామాల్లో సీఐ సుభాష్, ఎస్సై మణికుమార్ ఆధ్వర్యంలో కవాతు చేశారు.

భారీ అన్న సమారాధన



అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం చేస్తున్న దాతలు

పెదపాడు: మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం నిర్వహించారు. మంగళవారం పురస్కరించుకుని 200మందికి నిర్వహించిన ఈ అన్నదానానికి లక్ష్మీపురం గ్రామానికి చెందిన మేకా నరేంద్ర రాధ దంపతులు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో భాగంగా స్థానికులు మట్టా శ్రీను దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రామాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని ఒక చేపల చెరువుకు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న యజమానిపై కేసు నమోదు చేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని భీమడోలు మండలం లింగంపాడు గ్రామంలో బల్లె లీలాకుమార్ అనే వ్యక్తి తన చేపల చెరువుకు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై తమ విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేయగా, అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు నిర్ధారించారన్నారు. దీనిపై చెరువు యజమాని లీలా కుమార్‌పై విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేసి రూ.2,50,745 అపరాధ రుసుము విధించడంతో పాటు రూ.30 వేలు జరిమానా విధించామని తెలిపారు. జిల్లాలో ఎవరైనా అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రవికుమార్ హెచ్చరించారు.

'మేమంతా సిద్ధం' నమూనా చిత్రీకరణ

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27 నుంచి ఇడుపులపాయ నుంచి ప్రారంభించే మేమంతా సిద్ధం యాత్ర నమూనాను ఏలూరుకు చెందిన సూక్ష్మ కళాకారుడు మేతర సురేష్‌బాబు చిత్రీకరించారు. అగ్గిపుల్లపై వైఎస్ జగన్ చిత్రాన్ని, అట్టముక్కలతో బస్సును రూపొందించారు. పార్టీపై ఉన్న అభిమానంతో మేమంతా సిద్ధం యాత్ర నమూనాను చిత్రీకరించినట్టు మేతర సురేష్‌బాబు తెలిపారు.

ఉపాధి పనులు కల్పించాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో విలీనం చేసిన ఏడు గ్రామ పంచాయతీల్లో పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. స్థానిక పవరుపేటలోని సంఘ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోణంగి, కొమడవోలు, చొదిమెళ్ల, శనివారపుపేట, వెంకటాపురం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవి, సహాయ కార్యదర్శి ఎస్ మహంకాళీరావు, సత్తు కోటేశ్వరరావు, సాయి, చంటి, జె.గోపి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పవళింపు సేవ

భీమడోలు: గుండుగొలను, భీమడోలు శివాలయాల్లో నాలుగు రోజుల వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం రాత్రితో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా గుండుగొలను భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి, భీమడోలు పార్వతీ సమేత భీమేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు పుష్పయోగోత్సవం కనులపండువగా నిర్వ హించారు.

పల్లెల్లో అభివృద్ధి పరుగులు

- గ్రామ సచివాలయ వ్యవస్థతో తీరిన ప్రజల కష్టాలు
- రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యత
- రూ. 50 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం



దెందులూరు రైతుభరోసా కేంద్రం



దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్



దెందులూరు గ్రామ సచివాలయం



దెందులూరులో నూతనంగా నిర్మించిన ప్రధాన రహదారి

దెందులూరు: గ్రామాల్లో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ జరగని అభివృద్ధి గత నాలుగేళ్ల పాలనలో జరుగుతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. ప్రతిగ్రామంలో గత ఐదేళ్లుగా రూ.2నుంచి 16కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఇదేళ్ల గ్రామాల పరిస్థితి, ఇప్పటి గ్రామాల పరిస్థితిని చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మాణం చేసి ప్రతి గ్రామ సచివాలయంలో 11మంది ఉద్యోగులను నియమించి పరిపాలనను పల్లె ప్రజలు చేరువలోకి తీసుకువచ్చి సత్వర సేవలు అందజేస్తున్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడంతో గ్రామాలు మినీ సెక్రటరేట్లుగా ఉన్నాయి. గతంలో కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలు కావాలంటే దూర ప్రాంతంలోని మండల కేంద్రాల్లో గల తహసీల్దార్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లవలసి వచ్చేది. అదీ కూడా నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగవలసి వచ్చేది. దీనితో ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామ సచివాలయ వ్యవస్థ రావడంతో గంట వ్యవధిలోనే సొంత ఊరులోనే ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలను అందుకుంటున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యాన్ని ప్రజల ముంగిటకు తీసుకువచ్చి వైద్యులను అందుబాటులో ఉంచారు. గ్రామ స్వరాజ్యమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా నవరత్నాలు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. అలాగే, ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ వచ్చేలా రూపకల్పన చేసింది. నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన దెందులూరు కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి, సంక్షేమం జరిగింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి, సంక్షేమం, విద్యావంతుడు కొఠారు అబ్బయ్యచౌదరి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఐదేళ్ళల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రోత్సాహం, సహాయ, సహకారాలతో దెందులూరు గ్రామ రూపురేఖలు మార్చివేశారు. విద్యా, వైద్యం, పాలనాపరమైన భవనాలు, రైతు భరోసాకేంద్రం, గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్‌లతో పాటు రోడ్లు, డ్రెయిన్లు, ఆర్‌ఓ ప్లాంటు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పేదలకు ఇళ్ళ పట్టాలు, ఇళ్లకు రుణాలు మంజూరు ఇలా అభివృద్ధి, సంక్షేమాన్ని పెద్దఎత్తున చేసి చూపించారు.

- రోడ్లు,డ్రెయిన్లు, రైతుభరోసా కేంద్రం, సచివాలయం, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లకు రూ.8.31 కోట్లు
- కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రూ.2.71 కోట్లు
- డ్వాక్రా సంఘాలకు బ్యాంకు రుణాలు రూ. 30 కోట్లు
- డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా రూ. 5 కోట్లు
- డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలు రూ. 3 కోట్లు
- మొత్తం గ్రూపులు 300
- నాడు- నేడు పథకంలో పాఠశాలలకు రూ. 2కోట్ల 24 లక్ష
- పంపిణీ చేసిన ఇళ్ళ పట్టాలు 173
- వైఎస్సార్ పెన్షన్ కానుక 1682, రూ. 3 కోట్ల 78 లక్షలు, 45 వేలు

నియోజకవర్గం మరింత అభివృద్ధి



దెందులూరు నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాను. నియోజకవర్గానికి ముఖ్య కేంద్రమై దెందులూరులో ఇంత అభివృద్ధిని, గత టీడీపీ ప్రభుత్వం ఎందుకు చేయలేకపోయింది. అందరి సహాయ సహకారాలతో అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమం చేసేందుకు కృషి చేస్తాను.

– కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు ఎమ్మెల్యే

సమస్యలు సకాలంలో పరిష్కారం



విద్యావంతుడు పాలకుడు అయితే అన్ని సమస్యలు సకాలంలో సేవాభావంతో పరిష్కారమవుతాయి. ఆ నియోజకవర్గంలో ఉద్యోగులు, ప్రజలు, స్వేచ్ఛగా, శాంతియుతంగా జీవిస్తారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రణాళిక, దూరదృష్టి, సేవాభావం దెందులూరు నియోజవర్గానికి వరంలా మారింది.

– నిట్టా లీలానవకాంతం గంగరాజు, దెందులూరు జెడ్పీటీసీ

విద్యా వ్యవస్థలో మార్పులు



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. గ్రామగ్రామాన ప్రభుత్వ పాఠశాలలు, మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఉన్నాయి. ఆంధ్ర రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు దేశమంతా వచ్చి చూసేలా రాష్ట్ర ప్రభుత్వచర్యలు ఉన్నాయి.

– ఎస్.రాజ్‌కుమార్, ప్రైవేటు పాఠశాలల యూనియన్ దెందులూరు నియోజవర్గ అధ్యక్షుడు

క్షుణ్ణంగా తనిఖీ



వంగూరు జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

పెదవేగి : ఎన్నికలను, పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలను కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం కఠిన చర్యలు అమలు చేస్తోంది. చాలా ప్రాంతాల్లో అధికారులు చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా పెదవేగి మండలం వంగూరు సమీపంలో జాతీయ రహదారి దగ్గర మంగళవారం మత్స్యశాఖ ఏడీ, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నరసింహారావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం ఎవ్వరైనా రూ.50వేలకు మించి నగదును వెంట తీసుకెళ్ల కూడదన్నారు. ఎన్నికల నిబంధనలకు లోబడి మాత్రమే నడచుకోవాలని, లేదంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. తనిఖీ బృందంలో పెదవేగి ఏఎస్ఐ పీవీస్వీ, ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల్లో ట్యాప్‌ల చోరీ

దెందులూరు: మండలంలో సోమవారం రాత్రి 5 పాఠశాలల్లో ట్యాప్‌ల చోరీ జరిగింది. ఈ ఘటనకు సంబంధించి దెందులూరు ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్, కొవ్వలి, దోసపాడు, పోతునూరు, పాఠశాలల హెచ్‌ఎంలు దెందులూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో 56, పోతునూరు ప్రాథమిక పాఠశాలల్లో 14, పోతునూరు ఉన్నత పాఠశాలలో 14, దోసపాడు యూపీ పాఠశాలలో 10, మొత్తం 90 ట్యాప్‌లు, పుష్ ట్యాప్‌లు చోరీకి గురయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

హోర్డింగ్ తొలగింపు

ఉంగుటూరు: నిడమర్రు మండలం బువనపల్లిలో ఒక కాంప్లెక్స్‌పై ఉన్న రాజకీయ పార్టీ హోర్డింగ్‌ను తొలగించినట్టు ఆర్‌ఓ ఖాజావలి తెలిపారు. కోడ్ అమలులో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన ఉద్యోగులను ఆదేశించారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం



భీమడోలు శివాలయంలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుబాబు



అన్న సమారాధనలో ప్రసాదాలను వడ్డిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలులో అతిపురాతన ఆలయం పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వాసుబాబు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దిన అభివృద్ధి కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలో వాసుబాబు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను వడ్డించారు. వేలాది మంది భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. తొలుత ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు వాసుబాబుకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ నిర్వాహకులు చింతా శ్రీరామచంద్రమూర్తి, ఆర్బీకేల చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



కొవ్వలిలో సీతమ్మ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: మండలంలోని కొవ్వలి గ్రామంలో ప్రభాకరరావు సోదరి సీతమ్మ ఆకస్మిక మరణం బాధాకరమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం కొవ్వలిలో ప్రభాకరరావు సోదరి సీతమ్మ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం కొవ్వలిలో కొమ్మారెడ్డి రాంబాబు ఇంటికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రాంబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట దెందులూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, గ్రామ సర్పంచ్ ఇంటేటి మధులత, సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, ఎంపీటీసీ గౌరిపర్తి వరలక్ష్మి రంగారావు, జిల్లా కార్యదర్శి గొల్ల వీరాస్వామి, పార్టీ నాయకులు ఉన్నారు.

సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపండి

బుట్టాయగూడెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నాటు సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఐటీడీఏ పీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. కేఆర్‌పురం ఐటీడీఏ మీటింగ్ హాల్‌లో మంగళవారం రెవెన్యూ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, పోలీస్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నాటు సారా క్రయవిక్రయాలు జరగకుండా నిరోధించాలన్నారు. అదేవిధంగా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల్లో నిఘా పటిష్టంగా అమలు చేయాలన్నారు. అంతర రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమ మద్యం, సారాయి, మాదకద్రవ్యాలు ఏపీలోకి రాకుండా చెక్ పోస్టుల వద్ద నిరంతరం వాహనాల తనిఖీలు జరిగేలా చూడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అసిస్టెంట్ కమిషనర్ (విజిలెన్స్), స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి(పోలవరం), తహసీల్దార్‌లు, తదితరులు పాల్గొన్నారు.

అప్పనవీడులో నేను సిద్ధం..మా ఊరు సిద్ధం



ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మండల కన్వీనర్ అప్పన ప్రసాద్

పెదపాడు :అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ కొనియాడారు. పెదపాడు మండలంలోని అప్పనవీడులో నేను సిద్ధం మాఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అప్పనవీడు గ్రామంలో 25ఏళ్లుగా ఏ నాయకుడు సెంటు స్థలం ఎవరికీ ఇవ్వలేదని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ సొంతిల్లు ఇవ్వాలనే ఆలోచన చేసారని చెప్పారు. అదేవిధంగానే అప్పనవీడులో 10ఎకరాలు కొని పేదలకు ఇళ్ల స్థలాలు అందించడం జరిగిందని చెప్పారు. ఆన్‌లైన్ చేసుకున్న వారందరికీ ఈ ఎన్నికల అనంతరం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. పేదలకు సొంతింటి కల నెరవేరిందన్నారు. ఇంత అభివృద్ధి ఏనాడైనా చూసారా అంటూ ప్రశ్నించారు. జగనన్న ముఖ్యమంత్రి కావాలంటే ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అప్పన పద్మావతి గ్రామ సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, ఎంపీటీసీ బుద్ధే రామసీత స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట వేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే



ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటాపద్మశ్రీ

పెదపాడు: బీసీలకు పెద్ద పీట వేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. ఇంతవరకు 11స్థానాలు కేటాయించిన ముఖ్యమంత్రి మంగళవారం కొప్పుల వెలమ సామాజిక వర్గానికి చెందిన బూడి ముత్యాలనాయుడుకు ఎంపీ స్థానాన్ని కేటాయించడంతో 12 ఎంపీ స్థానాలు బీసీలకు ఇవ్వడం జరిగిందన్నారు. చంద్రబాబు బీసీలకు అండగా ఉంటానని మాటల్లో చెబితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్దపీట వేస్తానని చేసి చూపించారని చెప్పారు. ఇప్పటి వరకు ఉత్తరాంధ్రలోనే అరకొర సీట్లు కేటాయించి చేతులు దులుపుకుందని విమర్శించారు. రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు లేకపోవడంతో రాజకీయాల్లో బీసీలు వెనుకబడి ఉంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారికి 48అసెంబ్లీ స్థానాలు 12 ఎంపీ స్థానాలు కేటాయించి బ్యాక్‌బోన్‌క్లాస్‌గా మార్చారని గుర్తు చేసారు. టీడీపీ 4గురికి మాత్రమే టిక్కెట్లు ఇచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబుకు అధికార దాహంతో, తాపత్రయంతో సర్వశక్తులు ఒడ్డుతున్నారని చెప్పారు. ఏనాడైనా చంద్రబాబు ఒక్క బీసీ నాయకుడిని రాజ్యసభకు పంపించారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముగ్గురిని పంపించారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో పేదలు సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు కాబోతున్నారని చెప్పారు.

వైభవంగా పవళింపు సేవ



గుండుగొలను మల్లేశ్వరస్వామి



భీమడోలు భీమేశ్వరస్వామి

భీమడోలు: గుండుగొలను, భీమడోలు శివాలయాల్లో నాలుగు రోజుల వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం రాత్రితో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా గుండుగొలను భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి, భీమడోలు పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు పుష్పయోగోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్వామి వార్లను వివిధ రకాల పువ్వులతో సుందరంగా అలంకరించి ముస్తాబు చేశారు. ఆలయ అర్చకులు లంకా శ్రీనివాస్, కాళ్లకూరి ఉమాశంకర్‌లు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పుష్పయోగం సేవ తంతును ఘనంగా నిర్వహించారు.

'స్పందన' ఫిర్యాదుపై విచారణ

టి.నరసాపురం: స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం అధికారులు విచారణ నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో టి.నరసాపురానికి చెందిన డి.విల్సన్‌బాబు సొసైటీ వాటర్ ప్లాంట్‌కు సంబంధించి ఫిర్యాదు చేశారు. టి.నరసాపురం సొసైటీ వాటర్ ప్లాంట్ మూయడానికి కారణాలు, ప్లాంట్‌లో పని చేసే సిబ్బందికి న్యాయం చేయాలని, సొసైటీలో విలువైన సామగ్రి చోరీకి బాధ్యులెవరని, నష్టాన్ని వసూలు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఫిర్యాదుపై జిల్లా కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మోహన్ బాబు మంగళవారం విచారణ నిర్వహించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులో పేర్కొన్న ప్రతి అంశాన్ని క్షేత్రస్థాయిలో విచారించామని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

దుర్గమ్మ గుడికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. కనకదుర్గమ్మ, అన్నపూర్ణ, విశ్వేశ్వరస్వామి వారి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్మన్ బత్తిన నాగలక్ష్మి, చిన్న దంపతులు కనకదుర్గమ్మకు నూతన వస్త్రాలు సమర్పించారు. విఘ్నేశ్వరుడు, కనకదుర్గమ్మ అన్నపూర్ణ, విశ్వేశ్వర స్వామి, అభయాంజనేయస్వామి వారికి దూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లూరి రత్నాజీరావు, ఆలయ ధర్మకర్తలు భూమరాజు సత్యనారాయణరాజు, భూమరాజు ధనుంజయ రాజు, అల్లూరి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు అభినందనలు



బృంద సభ్యులకు అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన ప్రజాకళాకారులు, జానపద కళారత్న ఎల్‌ఆర్‌కృష్ణబాబు బృంద సభ్యులకు మంగళవారం నూకాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. కృష్ణబాబు పర్యవేక్షణలో కోలాటం నాట్యగురువు జె.సాయిభరత్ ఆధ్వర్యంలో బండి మల్లిక, సావిత్రిబాయి పూలే మహిళా కోలాట బృందం, 111 మంది భక్తులతో తమిళనాడు రాష్ట్రం అరుణాచలంలో అరుణగిరి చేటూట 23 గంటల పాటు నృత్య ప్రదర్శన చేస్తూ ప్రదక్షిణ పూర్తి చేశారు. అరుదైన ఈ ప్రదర్శనను గుర్తిస్తూ తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ (తానా), బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు గుర్తించి, అవార్డ్స్ ఇచ్చి కళాకారులను సత్కరించారు. ఎల్ఆర్.కృష్ణబాబు బృందాన్ని మంగళవారం పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

టి.నరసాపురం: పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో మంగళవారం టి.నరసాపురంలో సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఈ దాడు ల్లో ఐదుగురిని అరెస్టుచేసి, వారినుంచి రూ.4,080 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.